# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 05-06-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ భవిష్యత్ తరాలకు హరిత పుడమిని అందించడానికి సమిష్టిగా పని చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు.
- ❖ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈరోజు న్యూఢిల్లీలోని భగవాన్ మహావీర్ వనస్థలి పార్క్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ మొక్కలు నాటారు.
- ❖ పంటల్లో వైవిధ్యత, నీటిని ఆదా చేయడం, ఎక్కువ లాభం పొందడం అవసరమని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు.
- ❖ ఎన్డీయే ప్రభుత్వ 11 సంవత్సరాల ప్రయాణం ఎంతో ధైర్యమైన నిర్ణయాలు, భవిష్యత్ సంస్కరణలకు స్థానం కల్పించిందని కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ అన్నారు.

==========================

భవిష్యత్ తరాలకు హరిత పుడమిని అందించడానికి సమిష్టిగా పని చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. ఈరోజు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగ రాష్ట్రపతి సందేశాన్ని అందించారు. ప్రజలు పర్యావరణ అనుకూల ప్రవర్తన కలిగి ఉండాలని, దీని పరిరక్షణ దిశగా మనం చేసే ప్రతి ప్రయత్నం మార్పును తెస్తుందన్నారు. పచ్చదనం, పరి శుభ్రత నూతన భవిష్యత్ కోసం సమిష్టిగా పని చేయాలని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ సామాజిక మాధ్యమం వేదికగ తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యావరణ పరిరక్షణపై ఒక వీడియోను పంచుకున్నారు. పర్యావరణాన్ని పచ్చగా, మరింత మెరుగ్గా మార్చడానికి అట్టడుగు స్థాయిలో పని చేస్తున్న వారందరినీ ప్రధానమంత్రి అభినందించారు.

==========================

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు న్యూఢిల్లీలోని ఆయన నివాసంలో సిందూర మొక్కను నాటారు. సిందూర మొక్క దేశంలోని మహిళా శక్తి ధైర్యం, ప్రేరణకు బలమైన చిహ్నంగా నిలుస్తుందని ప్రధానమంత్రి సామాజిక మాధ్యమాల్లో పేర్కొన్నారు. 1971 భారత్ - పాకిస్తాన్ మధ్య

జరిగిన యుద్ధంలో అసాధారణ ధైర్యం, దేశభక్తిని ప్రదర్శించిన గుజరాత్‌లోని కచ్ ప్రాంతానికి చెందిన ధైర్యవంతులైన తల్లులు, సోదరీమణులు ఈ మొక్కను ఇటీవల గుజరాత్ పర్యటనకు వెళ్ళిన ప్రధానమంత్రికి బహుమతిగా ఇచ్చారు.

==========================

దేశంలో పేద ప్రజల సంక్షేమం కోసం పని చేస్తూ.. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం 11 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోడీ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఈరోజు పంచుకున్నారు. ప్రభుత్వానికి గరీబ్ కళ్యాణ్ పట్ల ఉన్న అంకితభావం గుర్తు చేసుకుంటూ... పేదరికం నుండి ప్రజల అభ్యున్నతికి కేంద్రం తీసుకున్న నూతన చర్యలను సాధికారత, మౌలిక సదుపాయాలను ప్రస్తావించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ప్రధానమంత్రి ఉజ్వల యోజన, జన్ ధన్ యోజన, ఆయుష్మాన్ భారత్ వంటి పలు కార్యక్రమాలు గృహనిర్మాణం, ఇంధనం, బ్యాంకింగ్, ఆరోగ్య సంరక్షణను మెరుగుపరిచాయని నరేంద్ర మోడీ పేర్కొన్నారు. పారదర్శకతతో చిట్ట చివరి వ్యక్తికి కూడా సంక్షేమ పథకాలు చేరువ కావడానికి ప్రత్యక్ష ప్రయోజనాలను అందించడంలో గ్రామీణ మౌలిక వసతులు ఉపకరించాయని చెప్పారు. 25 కోట్లకు పైగా ప్రజలు పేదరికాన్ని జయించడంలో ఈ పథకాలు దోహదపడ్డాయన్నారు. ప్రతి పౌరుడికి గౌరవంగా జీవించే అవకాశం కల్పిస్తూ... సమ్మిళిత, స్వావలంబన కలిగిన భారతదేశాన్ని నిర్మించడానికి కేంద్ర ప్రభుత్వం నిబద్ధతను ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు.

==========================

ఎన్డీయే ప్రభుత్వ 11 సంవత్సరాల ప్రయాణం ఎంతో ధైర్యమైన నిర్ణయాలు, భవిష్యత్ సంస్కరణలకు స్థానం కల్పించిందని కేంద్ర శాస్త్ర సాంకేతిక, భౌగోళిక శాస్త్ర శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ ఈరోజు అన్నారు. గడచిన 11 సంవత్సరాలుగా దేశ అభివృద్ధిని పునర్ నిర్వచించే విధంగా వ్యవస్థపై ప్రజలకు నమ్మకాన్ని, పునరుద్ధరించే దిశగా ఉందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం దీర్ఘకాలిక జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తూ.. గత దశాబ్ద కాలంగా నిర్ణయాలు తీసుకుందని అన్నారు. జీఎస్టీ అమలు, డిజిటల్ ఇండియాను ప్రోత్సహించడం, అంతరిక్షం, అణు శక్తి వంటి వ్యూహాత్మక రంగాలకు ప్రైవేట్ భాగస్వామ్యం కల్పించడం, ప్రపంచ వ్యాప్తంగా ఎదురవుతున్న పోటీ తత్వంలో భారత దేశాన్ని దార్శనికంగా ముందుకు నడిపించిందని ఆయన అన్నారు.

భారతదేశ విదేశాంగ విధానంపై స్పందిస్తూ... వ్యూహాత్మకంగా ప్రాముఖ్యత కలిగిన ప్రపంచ నాయకుడిగా ప్రధానమంత్రి నిలిచారని అన్నారు. రానున్న 25 సంవత్సరాలకు అవసరమైన పునాదిని వేశారని, తద్వారా భారతదేశం అత్యుత్తమ స్థానంలో నిలిచిందని చెప్పారు.

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రేపు జమ్మూ కాశ్మీర్ పర్యటన సందర్భంగా శ్రీనగర్ బారాముల రైల్ లింక్ ప్రాజెక్టును జాతికి అంకితం చేయనున్నారు. 272 కిలోమీటర్ల కలిగిన ఈ ప్రాజెక్టును దాదాపు 44 వేల కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించారు. ఈ ప్రాజెక్టు పూర్తిగా విద్యుద్దీకరించబడి 36 సొరంగాలు, 943 వంతెనలను కలిగి ఉంది. ప్రపంచంలోనే ఎత్తైన రైల్వే ఆర్చ్ వంతెన, భారతదేశ మొట్టమొదటి కేబుల్ స్టేడ్ రైల్వే వంతెనగ చీనాబ్ వంతెన, అంజి వంతెనను ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. ఈ ప్రాజెక్టు కాశ్మీర్ లోయను దేశంలోని ఇతర ప్రాంతాలకు మధ్య ఉన్న అనుసంధానాన్ని బలోపేతం చేస్తుంది.

విరామం

==========================

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈరోజు న్యూఢిల్లీలోని భగవాన్ మహావీర్ వనస్థలి పార్క్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏక్ పేడ్.. మా కే నామ్.. కార్యక్రమంలో

భాగంగా ప్రధానమంత్రి మర్రి మొక్కను నాటారు. ఆరావళి శ్రేణిలోని 700 కిలోమీటర్ల పొడవునా అడవులను పెంచడం లక్ష్యంగా ఆరావళి గ్రీన్ వాల్ ప్రాజెక్టులో భాగంగా ఈ మొక్కను నాటారు. ఢిల్లీ, రాజస్థాన్, హర్యానా, గుజరాత్ లతో సహా నాలుగు రాష్ట్రాలలో పచ్చదనాన్ని విస్తరించడం లక్ష్యంగా ఈ ప్రాజెక్టు నిర్వహిస్తున్నారు. అడవుల పెంపకం, నీటి వనరుల పునరుద్ధరణతో పాటు ఆరావళి జీవవైవిధ్యాన్ని పెంపొందించడం ఆరావళి గ్రీన్ వాల్ ప్రాజెక్టు లక్ష్యం.

ఢిల్లీ ప్రభుత్వం స్థిరమైన రవాణా వ్యవస్థ కల్పనలో భాగంగా ప్రవేశపెట్టిన 200 విద్యుత్ బస్సులను ప్రధానమంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఇవి స్వచ్ఛమైన పట్టణ రవాణా వ్యవస్థను ప్రోత్సహిస్తూ... పర్యావరణ సమతుల్యత పట్ల దేశ సమిష్టి బాధ్యతను సూచిస్తుందని తెలిపారు.

==========================

కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈరోజు "వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్" (VKSA)లో భాగంగా పాటియాలాలోని రాజ్‌పురాలో జరిగిన కిసాన్ చౌపాల్ కార్యక్రమంలో రైతులతో సంభాషించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ లో భాగంగా శాస్త్రవేత్తలు పంట పొలాలను సందర్శించి నేల, పర్యావరణ సంబంధిత సమస్యల పరిష్కారానికి రైతుల ఆలోచనలు స్వీకరిస్తున్నారని అన్నారు. శాస్త్రవేత్తలు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా అనువైన పంటలపై రైతులకు మార్గనిర్దేశం చేస్తున్నారని చెప్పారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం పొందడం, రైతుల ఉత్పత్తిని పెంచే దిశగా ఇది జరుగుతోందన్నారు. పంజాబ్‌లో రైతులు దేశ ఆహార భద్రతకు గణనీయంగా దోహదపడుతున్నారని చెప్పారు. పంటల్లో వైవిధ్యత, నీటిని ఆదా చేయడం, ఎక్కువ లాభం పొందడం అవసరమని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొంటూ...

(వాయిస్ 36 సెకన్లు)

==========================

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారతదేశ దృఢమైన వైఖరిని ప్రపంచ దేశాలకు తెలియజేసే ప్రక్రియలో భాగంగా కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ సభ్యులు శశి థరూర్ నేతృత్వంలోని బహుళ పార్టీల ప్రతినిధి బృందం అమెరికాలోని వాషింగ్టన్ డిసిలో హౌస్ ఫారిన్ అఫైర్స్ కమిటీ సభ్యులతో సమావేశమైంది. ఈ సమావేశం  అనతరం శశి థరూర్ మాట్లాడుతూ.... ఉగ్రవాద దాడులను ఖండించడంలో ప్రపంచ దేశాలు అందిస్తున్న మద్దతుకు భారతదేశం తరపున కృతజ్ఞతలు తెలిపారు. హౌస్ ఫారిన్ అఫైర్స్ కమిటీ చైర్మన్ బ్రియన్ మాస్ట్ ఉగ్ర దాడిని ఖండించారు.

జెడి(యు) ఎంపీ సంజయ్ ఝా నేతృత్వంలోని అఖిలపక్ష ప్రతినిధి బృందం ఈరోజు న్యూఢిల్లీలో విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌ను కలిశారు. డిఎంకె ఎంపీ కనిమొళి నేతృత్వంలోని మరోక ప్రతినిధి బృందం కూడా విదేశాంగ మంత్రితో సమావేశమైంది.

==========================

భారతీయ జనతా పార్టీ నేతృత్వం లోని NDA కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి11 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. గత 11 సంవత్సరాల్లో తీసుకొచ్చిన ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు దేశ ప్రజల పురోగతికి కారణమయ్యాయి. గరీబ్ అన్న కళ్యాణ్ యోజన పేరిట ఇప్పటివరకూ 81 కోట్ల మందికి ఆహార ధాన్యాలను ప్రభుత్వం పంపిణీ చేసింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 4 కోట్ల మంది పేదలకు గృహాలను నిర్మించింది. జల్ జీవన్ మిషన్ ద్వారా 15 కోట్లకు పైగా మంచి నీటి కొళాయి కనెక్షన్లతో రక్షిత తాగునీటి సదుపాయం కల్పించింది.

==========================
==========================